# తెలంగాణవీణ

నిజం నిగ్గు తేల్చుద్దాం..

https://epaper.telanganaveena.com/

DYNAMIC 5:00PM

శనివారం /30.03.2024


# సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష.. విద్యుత్ శాఖ, తాగునీటిపై చర్చ

తెలంగాణవీణ,హైదరాబాద్



తెలంగాణ సచివాలయంలో ఇవాళ సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించనున్నారు. విద్యుత్ శాఖ, తాగునీటిపై సీఎం రేవంత్‌రెడ్డి చర్చించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు సచివాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో తాగునీటి అవసరాలపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. వేసవిలో నీటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు సూచనలిస్తామన్నారు. మరోవైపు ఎండలు తీవ్రంగా ఉండబోతున్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ వర్గాలు సూచిస్తున్నాయి. ఎండలు ఎక్కువ కావడం నీటి కోసం తిప్పలు ప్రజలు పడుతుండటంపై చర్చలు జరుపనున్నారు. అంతే కాకుండా.. ఈ ఎండలకు పవర్ కట్ కాకుండా చూడటానికి రేవంత్ సర్కార్. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది పడకుండా కరెంట్, తాగునీటిపై అధికారులతో చర్చించనున్నారు.

# భారతరత్న అవార్డును స్వీకరించిన పీవీ నరసింహారావు కుటుంబం



తెలంగాణవీణ,జాతీయం

పీవీ నరసింహారావు తరఫున ఆయన కుటుంబం భారతరత్నను స్వీకరించింది. దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ప్రదానోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వీటిని ప్రదానం చేశారు. పీవీ తరఫున ఆయన తనయుడు ప్రభాకర్ రావు ఈ పురస్కారాన్ని స్వీకరించారు. ఈసారి భారతరత్న ఐదుగురికి ఇచ్చారు. కర్పూరీ ఠాకూర్, స్వామినాథన్, చరణ్ సింగ్ కుటుంబ సభ్యులు కూడా భారతరత్నను స్వీకరించారు. ఈ నలుగురికి మరణానంతరం అవార్డు లభించడంతో వారి వారి కుటుంబ సభ్యులు స్వీకరించారు. కర్పూరీ ఠాకూర్ తరఫున ఆయన తనయుడు రామ్‌నాథ్, చరణ్ సింగ్ తరఫున మనవడు జయంత్ సింగ్, స్వామినాథన్ తరఫున కూతురు నిత్యారావు అవార్డులను స్వీకరించారు. రాష్ట్రపతి, ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం బీజేపీ అగ్రనేత అద్వానీ ఇంటికి వెళ్లి అవార్డును ప్రదానం చేయనున్నారు.

# బీఆర్ఎస్ కు దూరమవుతున్న నేతలు



* రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్
* కాంగ్రెస్ లో చేరబోతున్న కడియం శ్రీహరి

తెలంగాణవీణ,హైదరాబాద్

బీఆర్ఎస్ కీలక నేతలు ఒక్కొక్కరుగా కారు దిగిపోతున్నారు. ఇప్పటికే పలువురు నేతలు పార్టీకి గుడ్ బై చెప్పారు. తాజాగా ఈరోజు జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ కాంగ్రెస్ గూటికి చేరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో వీరు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జి దీపాదాస్ మున్షీ, పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. వీరిద్దరికీ రేవంత్, దీపాదాస్ మున్షీ పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్ లోకి సాదరంగా ఆహ్వానించారు. విజయలక్ష్మి తండ్రి, రాజ్యసభ సభ్యుడు కె.కేశవరావు కూడా బీఆర్ఎస్ కు రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఆయన నిన్న రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. తన రాజకీయ జీవితం కాంగ్రెస్ తోనే ప్రారంభమయిందని, నాలుగు దశాబ్దాల పాటు తాను కాంగ్రెస్ లో ఉన్నానని, కాంగ్రెస్ లోనే చస్తానని నిన్న ఆయన తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కడియం శ్రీహరి కూడా కాంగ్రెస్ లో చేరబోతున్నారు. కాసేపట్లో కడియం శ్రీహరి, ఆయన కుమార్తె కడియం కావ్య రేవంత్ ను కలిసే అవకాశం ఉంది.

# తమిళ సినీనటుడు డానియెల్ బాలాజీ గుండెపోటుతో మృతి

తెలంగాణవీణ,జాతీయం



ప్రముఖ తమిళ సినీ నటుడు డానియెల్ బాలాజీ 48 ఏళ్ల వయసులోనే గుండెపోటుతో మృతి చెందారు. చెన్నైలో శుక్రవారం ఆయనకు ఛాతిలో నొప్పి రావడంతో ఆసుపత్రికి తరలించగా ఆ రాత్రి మృతి చెందారు. డానియెల్ బాలాజీ ఆకస్మిక మరణంతో తమిళ సినీరంగం దుఃఖంలో కూరుకుపోయింది. కమల్ హాసన్ చిత్రం 'మరుదునయగమ్'తో ప్రొడక్షన్ మేనేజర్‌గా డేనియల్ బాలాజీ తన కెరీర్ ప్రారంభించాడు. అయితే, ఆ చిత్ర నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. అనంతరం, రాధిక శరత్‌కుమార్ 'ఛిత్తీ' టీవీ సీరియల్‌లో డానియెల్ పాత్ర ఆయనకు మంచి పేరు తెచ్చిపెట్టింది. దీంతో, డానియెల్ బాలాజీగా ఆయన పాప్యులర్ అయ్యారు. ఆయన పలు తెలుగు, మలయాళం, కన్నడ చిత్రాల్లో నటించారు.

# పిఠాపురం చేరుకున్న జనసేనాని పవన్ కల్యాణ్

తెలంగాణవీణ,ఏపీ బ్యూరో





జనసేనాని పవన్ కల్యాణ్ నేటి నుంచి ఎన్నికల ప్రచారం చేపడుతున్నారు. తాను పోటీ చేస్తున్న పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచే ప్రచార పర్వానికి శ్రీకారం చుడుతున్నారు. పవన్ ఎన్నికల ప్రచార యాత్రకు వారాహి విజయభేరి అని నామకరణం చేసిన సంగతి తెలిసిందే. వారాహి వాహనం ద్వారా పవన్ ఎన్నికల ప్రచార పర్యటనలు సాగించనున్నారు. ఈ క్రమంలో, పవన్ పిఠాపురం చేరుకున్నారు. ఆయనకు హెలిప్యాడ్ వద్ద జనసేన పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. అనంతరం పవన్ దొంతుమూరు గ్రామానికి వెళ్లారు. పిఠాపురం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ నివాసానికి వెళ్లి ఆయనతో మర్యాదపూర్వకంగా భేటీ కానున్నారు. తాజా రాజకీయ పరిస్థితులు, నియోజకవర్గ అంశాలపై ఇరువురు చర్చించుకోనున్నారు.